ఎరుకల సాధికారతకు 60 కోట్లు

- వైఈఎస్ పథకానికి నిధులు
- 1.44 లక్షల మందికి ప్రయోజనం
- 50 శాతం సబ్సిడీతో యూనిట్‌కు 30 లక్షలు
- పందుల పెంపకంలో శిక్షణ
- విధివిధానాలు ప్రకటించిన సర్కారు

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడి ఎస్టీల్లో మరింత వెనుకబడిన వర్గమైన ఎరుకల సామాజిక వర్గానికి రాష్ట్ర ప్రభుత్వం ఆధునిక బతుకు 'ఎరుక' చెప్పింది. ప్రతికూల పరిస్థితులను అధిగమించి స్వశక్తితో ఎదిగేందుకు ప్రారంభించిన ఎరుకల సాధికారత పథకాని (వైఈఎస్) కి ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.60 కోట్లు కేటాయించింది. వైఈఎస్ పథకానికి సంబంధించిన విధివిధానాలను శనివారం రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తూ విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ట్రైకార్‌కు (గిరిజన ఆర్థిక సహకార సంస్థ)కు 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ. 543.45 కోట్లు కేటాయించింది. అందులోంచి వైఈఎస్‌కు రూ.60 కోట్లు ఇచ్చింది. ఎరుకల సామాజిక వర్గానికి ఈ పథకం ద్వారా నవీన మార్గాన్ని చూపినట్టు అయిందని గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. రాష్ట్రంలో 1.44 లక్షలు ఉన్న ఎరుకల జనాభా (గిరిజన జనాభాలో ఎరుకలు 4.54 శాతం)ను సైతం సీఎం కేసీఆర్ అక్కున చేర్చుకున్నారని చెప్పారు. కేసీఆర్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో 5 వేలు అంతకంటే ఎక్కువ ఎరుకుల జనాభా రంగారెడ్డి, ఖమ్మం, వరంగల్, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, నల్లగొండ, కరీంనగర్, సూర్యాపేట, హైదరాబాద్, మహబూబాబాద్, జనగామ, యాదాద్రి-భువనగిరి, కామారెడ్డి తదితర 13 జిల్లాల్లో ఉన్నారు. ఎరుకుల తెగ సంప్రదాయ వృత్తి పందుల పెంపకం, బుట్టలు అల్లడం, ఎరుక చెప్పడం, చీపుర్ల తయారీ. పందుల పెంపకం తరాలుగా జీవనోపాధిగా వస్తున్నది.

శాస్త్రీయ పద్ధతిలో పందుల పెంపకం

పందుల పెంపకంలో శాస్త్రీయ పద్ధతులను ప్రవేశపెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం పందుల పెంపకం విధానాన్ని రూపొందించింది. పందుల పెంపకం, కబేలాల ఏర్పాటు, మాంసం ప్రాసెసింగ్, మార్కెటింగ్, అదనపు విలువజోడింపు కోసం మౌలిక సదుపాయాల కల్పనకు మరింత ప్రాధాన్యం ఇచ్చేందుకు 6,359 మంది ఎరుకల సభ్యులతో 137 ప్రాథమిక పందుల పెంపకం సంఘాలు ఏర్పాటు చేసింది. వైఈఎస్ ద్వారా శాస్త్రీయ పద్ధతిలో పందుల పెంపకానికి మూడు రకాలుగా అండగా నిలిచేందుకు కమ్యూనిటీ-లెవెల్ మౌలిక వసతులు సృష్టించేందుకు చర్యలు తీసుకున్నది.

వైఈఎస్ - ఆర్థిక చేయూత విధానం

- యూనిట్ కాస్ట్‌లో గరిష్ఠ పరిమితి రూ.30 లక్షలు. ఇందులో 50 శాతం సబ్సిడీ, 40 శాతం బ్యాంకు లోన్, 10 శాతం లబ్ధిదారుడి (సొసైటీ) వాటా. భూకొనుగోలు, అద్దె, లీజు, మూలధన వ్యయం, వ్యక్తిగత వాహనాలకు సబ్సీడీ వర్తించదు.
- స్వయం సహాయ సంఘాలు, ప్రాథమిక పందుల పెంపకం సంఘాలు ఈ పథకానికి అర్హులు
- సొసైటీ లేదా యూనిట్‌కు 2 ఎకరాల సొంతభూమి ఉండాలి. లీజు భూమి అయితే కనీసం 7 సంవత్సరాల లీజు ఒప్పందం ఉండాలి.
- పందుల పెంపకం యూనిట్ మానవ సమూహాలకు 3 నుంచి 5 కిలోమీటర్ల దూరంలో ఉండాలి.
- ప్రాథమిక పందుల పెంపకం సంఘం కార్యవర్గ తీర్మానం జతచేయాలి.

దరఖాస్తు విధానం

సొసైటీ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, బ్యాంకు రుణ అంగీకార పత్రం, సొసైటీ తీర్మానం, గ్రామ/మున్సిపాలిటీ నిరభ్యంతర పత్రం, భూయాజమాన్య/లీజు పత్రాలు, బ్యాంకు ఖాతా పాస్‌బుక్.

యూనిట్ ఎంపిక కమిటీ

కలెక్టర్ నేతృత్వంలోని కమిటీ యూనిట్‌కు అర్హులను ఎంపిక చేస్తుంది. జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి, మున్సిపల్ కమిషనర్/ పంచాయతీ అధికారి, జిల్లా పశుసంవర్ధక, పరిశ్రమల శాఖ అధికారులు, లీడ్ బ్యాంక్, జిల్లా మార్కెటింగ్ మేనేజర్లు ఉంటారు.

రాష్ట్రస్థాయి కమిటీ

రాష్ట్రస్థాయి కమిటీకి ప్రిన్సిపల్ సెక్రటరీ/ గిరిజన సంక్షేమశాఖ సెక్రటరీ చైర్మన్‌గా, గిరిజన సంక్షేమశాఖ కమిషనర్/ ట్రైకార్ మేనేజింగ్ డైరెక్టర్ కో-కన్వీనర్‌గా, సభ్యులుగా పశుసంవర్ధకశాఖ డైరెక్టర్, పరిశ్రమల శాఖ కమిషనర్, స్టేట్ లెవల్ బ్యాంకర్స్ కమిటీ కన్వీనర్, నాబార్డు సీజీఎం ఉంటారు. ప్రత్యేక ఆహ్వానితులుగా పీవీ నరసింహారావు వెటర్నరీ వర్సిటీ వైస్ చాన్స్‌లర్, ఐసీఏఆర్ డైరెక్టర్ ఉంటారు.

> ఎరుకల తెగ సంప్రదాయ పందుల పెంపకంలో స్థల పరిమితులు, శాస్త్రీయ పద్ధతులను సరిగా ఉపయోగించకపోవడం, మున్సిపాలిటీ ల్లో చట్టపరమైన అసమ్మతి కారణంగా అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో పందుల పెంపకం, ప్రాసెసింగ్, అదనపు విలువ జోడింపు, మార్కెటింగ్ సమగ్ర అభివృద్ధి కోసం కొత్త పందుల పెంపకం విధానాన్ని అమలు చేయటానికి 2022లో పశుసంవర్ధకశాఖ, పీవీ నరసింహారావు వెటర్న రీ యూనివర్సిటీ, ఐసీఏఆర్ (నేషనల్ రిసెర్చ్ సెంటర్) సం యుక్త ఆధ్వర్యంలో సమగ్ర అధ్యయనాన్ని చేపట్టాలని ఆదేశించింది. ఆ అధ్యయన నివేదిక అందిన వెంటనే ఎరుకల సాధికారత పథకానికి (వైఈఎస్) రూపకల్పన చేసింది. ఈ పథకాన్ని మెదక్ జిల్లాలో మంత్రులు హరీశ్‌రావు, సత్యవతి రాథోడ్ ఇటీవల లాంఛనంగా ప్రారంభించారు.

సవాళ్లకు అనుగుణంగా

వైఈఎస్‌లో భాగంగా చేపట్టే మూడు క్యాటగిరీలు

రకం	కార్యక్రమం
ప్రాథమిక	వాతావరణ నిరోధక పందుల పెంపకం యూనిట్.
ద్వితీయ	స్లాటర్ హౌస్, కోల్డ్ స్టోరేజ్, ప్యాకేజింగ్ యూనిట్ ఫ్రీజర్లతో కూడిన రవాణా వాహనం
తృతీయ	మాంసం ఉత్పత్తుల తయారీ కేంద్రాలు, రిటైల్ మార్కెటింగ్ అవుట్‌లెట్స్

శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన అంతర్జాతీయ మధ్యవర్తిత్వ దినోత్సవంలో పాల్గొన్న సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ హిమాకోహ్లీ, హైకోర్టు సీజే జస్టిస్ అలోక్ అరాధే తదితరులు

మధ్యవర్తిత్వంలో ఐఏఎంసీ కీలక పాత్ర

- ట్రిబ్యునల్స్‌లో మహిళల పాత్రను పెంచాలి
- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హిమా కోహ్లీ

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): అంతర్జాతీయ మధ్యవర్తిత్వ కేంద్రం (ఐఏఎంసీ) హైదరాబాద్‌లో ఏర్పాటుచేయడం వివాదాల సత్వర పరిష్కారం దిశగా తీసుకున్న కీలకమైన ముందడుగుగా సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హిమా కోహ్లీ అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ మధ్యవర్తిత్వ దినోత్సవాన్ని శనివారం హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. జస్టిస్ హిమా కోహ్లీ మాట్లాడుతూ ప్రత్యామ్నాయ వివాద పరిష్కార వేదిక (ఏడీఆర్)పట్ల నమ్మకాన్ని మరింత పెంపొందించే దిశగా హైదరాబాద్ ఐఏఎంసీ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నదని చెప్పారు. అంతర్జాతీయ మధ్యవర్తిత్వ ట్రిబ్యునల్స్‌లో తగినంత మహిళల ప్రాతినిధ్యం లేకపోవడాన్ని ఆమె ఎత్తిచూపారు. మహిళలకు సమాన అవకాశాలు కల్పించాలని, ఇందుకు అనేక ఇతర మార్గాలున్నాయని చెప్పారు.

తటస్థత అమలు చేయాలి: జస్టిస్ అరాధే

గతంలో అంతర్జాతీయ వివాదాల పరిష్కారానికి సింగపూర్ వెళ్లాల్సి వచ్చేదని, ఇప్పుడు ఇక్కడే పరిష్కరించుకోవచ్చని హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే పేర్కొన్నారు. కీలక సూత్రాలైన తటస్థత, సమర్థత, అమలు నుంచి వైదొలగరాదని సూచించారు. హైదరాబాద్ ఏఐఎంసీ ఆసియన్ ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ సెంటర్‌తో, తెలంగాణ రెరా అవగాహన ఒప్పందం చేసుకున్నది. యూఏఈకి చెందిన న్యాయ నిపుణులు, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తులు జస్టిస్ ఎల్ నాగేశ్వరరావు, ఆర్‌వీ రవీంద్రన్ పాల్గొన్నారు.

శనివారం నాంపల్లిలోని అనీస్-ఉల్-గుర్బా భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు మహమూద్ అలీ, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే అక్బరుద్దీన్, కార్పొరేషన్ చైర్మన్లు

మైనార్టీల సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషి

- హోంమంత్రి మహమూద్ అలీ
- మంత్రి కొప్పుల ఈశ్వర్‌తో కలిసి నాంపల్లిలో అనీస్-ఉల్-గుర్బా అనాథ శరణాలయం ప్రారంభం
- హజ్‌హౌస్ బ్లాక్‌కు శంకుస్థాపన

తెలుగు యూనివర్సిటీ/మోహదీపట్నం, అక్టోబర్ 7: తెలంగాణ ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నదని, దాదాపు 25 సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని హోంమంత్రి మహమూద్ అలీ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో దాదాపు రూ.20 కోట్లతో అన్ని రకాల వసతులతో రూపుదిద్దుకున్న నాంపల్లిలోని అత్యంత పురాతన అనీస్-ఉల్-గుర్బా అనాథ శరణాలయాన్ని శనివారం మంత్రి కొప్పుల ఈశ్వర్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం నాంపల్లి హజ్‌హౌస్‌లో నార్త్‌బ్లాక్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా హోంమంత్రి మహమూద్ అలీ మాట్లాడుతూ.. 1921లో మీర్‌ఖాజా బద్రుద్దీన్ చిస్తీ నెలకొల్పిన ఈ అనాథ శరణాలయం 500 గజాల విస్తీర్ణంలో ఉండేదని, ప్రస్తుతం 4,500 చదరపు గజాలలో ఏడు అంతస్థుల్లో కొత్త భవన సముదాయాన్ని నిర్మించినట్టు తెలిపారు. ఇందులో 600 మంది పేద, అనాథ బాలలకు సరిపడేలా వసతులు కల్పించామని చెప్పారు. అనాథలకు వసతితోపాటు వృత్తి నైపుణ్య శిక్షణ, ఆరోగ్య సంరక్షణతో పాటు కేజీ నుంచి పీజీ విద్య అందించేందుకు ఈ కేంద్రాన్ని ఉపయోగించుకోనున్నట్టు వివరించారు. అనంతరం హజ్‌హౌస్ నార్త్‌బ్లాక్ నిర్మాణానికి శంకుస్థాపన చేసి, 23 కోట్టు కేటాయించినట్టు వెల్లడించారు. మసీదుల్లో పని చేసే 7 వేల మంది ఇమామ్‌లు, మౌజమ్‌లకు రూ.5 వేల భృతికి సంబంధించిన ప్రొసీడింగ్స్ పత్రాలను పంపిణీచేశారు. ఇప్పటివరకు 10 వేలమందికి ఇచ్చామని, అదనంగా మరో ఏడు వేల మందికి కూడా మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్ రావు, ఎంఐఎం శాసనసభ పక్ష నాయకుడు అక్బరుద్దీన్ ఒవైసీ, హజ్ కమిటీ చైర్మన్ సలీం, మైనార్టీ కమిషన్ చైర్మన్ తారిక్ అన్సారీ, వక్ బోర్డు చైర్మన్ మసీయుల్లాఖాన్, ఎమ్మెల్యే జాఫర్‌హుస్సేన్, మైనార్టీస్ సంక్షేమ శాఖ సెక్రటరీ జలీల్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

తక్కువ ర్యాంకొచ్చినా మెడికల్ సీటు

- ఏటా 10 వేల మంది డాక్టర్లను అందించనున్న తెలంగాణ
- ప్రైవేటు మెడికల్ కాలేజీలకు విదేశాల నుంచి విద్యార్థులు
- నీలిమ మెడికల్ కాలేజీ ప్రారంభోత్సవంలో మంత్రి హరీశ్

వెంకటాపూర్‌లోని నీలిమ మెడికల్ కళాశాలను ప్రారంభిస్తున్న మంత్రులు హరీశ్‌రావు, మల్లారెడ్డి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితరులు

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబర్ 7: తెలంగాణలో తక్కువ ర్యాంక్ వచ్చిన వారికి కూడా డాక్టర్ సీటు దొరుకుతుందని మంత్రి హరీశ్ రావు తెలిపారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ మండలం వెంకటాపూర్‌లోని అనురాగ్ వర్సిటీ అనుబంధ సంస్థ నీలిమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కళాశాలను మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్సీ, యూనివర్సిటీ చైర్మన్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డితో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. తెలంగాణలో ప్రైవేట్ వర్సిటీ ఆధ్వర్యంలో ఏర్పడిన మొదటి మెడికల్ కళాశాల నీలిమ కాలేజీ అని పేర్కొన్నారు. తెలంగాణలో శాంతిభద్రతలు, అన్ని రకాల సౌకర్యాలు ఉన్నందున ఇతర రాష్ట్రాల విద్యార్థులు ఇక్కడ వైద్య కళాశాలల్లో చేరుతున్నారని చెప్పారు.

ఎక్కువ ఎంబీబీఎస్ ఇక్కడే..

దేశంలో ఎక్కువ ఎంబీబీఎస్ సీట్లు తెలంగాణలోనే ఉన్నాయని, ప్రతి లక్ష మందికి 22 మంది వైద్యులు తయారవుతున్నారని మంత్రి హరీశ్‌రావు స్పష్టంచేశారు. ప్రతి ఒక్కరికీ వైద్య సేవలు అందించేందుకు సీఎం కేసీఆర్ జిల్లాకో మెడికల్ కళాశాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారని గుర్తుచేశారు. నీలిమ మెడికల్ కళాశాల నిర్మాణం, ఆధునిక పరికరాలు, ఫ్యాకల్టీల ఏర్పాటు చాలాబాగుందని ప్రశంసించారు. మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ.. దేశానికి సరిపడా డాక్టర్లను అందించే స్థాయికి తెలంగాణ ఎదిగిందని చెప్పారు. ఎమ్మెల్సీ పల్లా మాట్లాడుతూ.. వైద్య విద్యార్థులకు కావాల్సిన సౌకర్యాలతోపాటు మంచి విద్యనందించి ఉత్తమ డాక్టర్లుగా తీర్చిదిద్దటమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్టు చెప్పారు. మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, పోచారం మున్సిపల్ చైర్మన్ కొండల్‌రెడ్డి, అనురాగ్ వర్సిటీ సీఈవో సూర్యదేవర నీలిమ, వైస్ చాన్స్‌లర్ రామచంద్రం, అడ్మిన్ డైరెక్టర్ ఎం శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

కళ్లుండీ అభివృద్ధిని చూడలేని విపక్షాలు

- కోలేటి దామోదర్

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): సీఎం కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ అభివృద్ధిలో దూసుకెళ్తుంటే.. ప్రతిపక్షాలు కళ్లుండీ చూడలేని కబోధుల్లా వ్యవహరిస్తున్నాయని పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. పదేండ్లలో సీఎం కేసీఆర్ ఎన్నో అద్భుతాలు చేశారని, అందుకే రాష్ట్రం సుభిక్షంగా ఉన్నదని శనివారం ఒక ప్రకటనలో కొనియాడారు. తెలంగాణ అభివృద్ధి కావ డం విపక్ష నాయకులు ఇష్టంలేక.. ప్రభుత్వంపై నిత్యం బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు.

రసవత్తర రాజకీయం

శనివారం పాలమూరులో పీఆర్టీయూ ఆత్మీయ సమ్మేళనంలో క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను సన్మానిస్తున్న సంఘం నాయకులు

శ్రీనివాస్‌గౌడ్‌కు పీఆర్టీయూ మద్దతు

ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సర్కారు అండగా ఉంటాం: శ్రీనివాస్‌గౌడ్

పాలమూరు, అక్టోబర్ 7: ఉద్యోగులు, ఉపాధ్యాయ సంఘాలకు బీఆర్ఎస్ సర్కారు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. శనివారం రాత్రి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన పీఆర్టీయూ ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా మంత్రిని సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. రాబోయే ఎన్నికల్లో శ్రీనివాస్‌గౌడ్‌ను మరోసారి అఖండ మెజారిటీతో గెలిపించుకుంటామని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమలాకర్, నాయకులు స్పష్టం చేశారు. ఆయనకు తాము సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్టు ప్రకటించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పీఆర్టీయూ నాయకుడి కుమారునిగా, ఉద్యోగ సంఘాలు, ఉద్యమ నేతగా.. ఉద్యోగ, ఉపాధ్యాయులపై ప్రత్యేక అభిమానంతో పనిచేస్తానని తెలిపారు. వారికి ప్రభుత్వం, తాను వెన్నంటే ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెన్నకేశవరెడ్డి, జిల్లా అధ్యక్షుడు నారాయణగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రఘురాంరెడ్డి, జిల్లా గౌరవ అధ్యక్షుడు గోపాల్ నాయక్, యూనియన్ నాయకులు, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మేమంతా పోచారం వెంటే..

- మద్దతు పలికిన పలు కుల సంఘాలు

బాన్సువాడ, అక్టోబర్ 7: బాన్సువాడ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి, స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డికి రోజురోజుకు మద్దతు పెరుగుతున్నది. వచ్చే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేస్తామని పలు సంఘాలు స్వచ్ఛందంగా తీర్మానం చేశాయి. తాడ్కోల్ పీఎస్ఆర్ బీడీ వర్కర్స్ కాలనీ సంఘం, నస్రుల్లాబాద్ మండలం మిర్జాపూర్ మాల సంఘ సభ్యులు శనివారం స్పీకర్‌ను బాన్సువాడలో కలిసి తీర్మాన పత్రాలను అందజేశారు. బాన్సువాడ అభ్యర్థిగా పోచారం శ్రీనివాసరెడ్డిని ప్రకటించిన సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. బాన్సువాడ మండలం తిర్మలాపూర్‌కు చెందిన బోయి కులస్థులు కూడా స్పీకర్‌కు మద్దతు ప్రకటించారు. గ్రామంలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి వచ్చిన సభాపతికి తీర్మాన ప్రతులను అందజేశారు.

ఎమ్మెల్యే జీవన్‌రెడ్డికి కుల సంఘాల మద్దతు

ఆర్మూర్/మాక్లూర్, అక్టోబర్ 7: రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, అమలుచేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ప్రజలు, పలు కుల సంఘాల వారు బీఆర్ఎస్‌కు జైకొడుతున్నారు. వచ్చే ఎన్నికల్లో ఆర్మూర్ నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి ఆశన్నగారి జీవన్‌రెడ్డిని గెలిపించుకుంటామని తీర్మానం చేశారు. ఆర్మూర్‌లోని జిరాయత్‌నగర్ కాలనీకి చెందిన భవానీ గంగపుత్ర, పెర్కిట్ తర్ప పద్మశాలీ, మామిడిపల్లి తర్ప పద్మశాలీ, పెర్కిట్ నాయీ బ్రాహ్మణ, జర్నలిస్టుకాలనీ మాల సంఘం ప్రతినిధులు, వెల్మల్ గ్రామానికి చెందిన మున్నూరుకాపు, యాదవ, దత్తాపూర్ బంజారా, ఆర్మూర్ మేస్త్రీ, డొంకేశ్వర్‌లోని శ్రీలక్ష్మీ మహిళా, గద్వాల్ క్యాంప్ బీసీ, దేగాం మాదిగ సంఘ సభ్యులు శనివారం జీవన్‌రెడ్డికి మద్దతుగా ఏకగ్రీవ తీర్మానాలు చేశారు. తీర్మానాల కాపీలను జీవన్‌రెడ్డికి అందజేసి బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పారు.

'లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సిసో కౌన్సిల్' సభ్యులతో డీజీపీ అంజనీకుమార్ తదితరులు

పోలీసులకు సవాల్‌గా సైబర్ నేరాలు

- నిపుణుల సాయంతో కేసుల ఛేదన
- డీజీపీ అంజనీకుమార్ వెల్లడి
- సైబర్ నేరాల కట్టడికి దేశంలోనే తొలిసారిగా లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సిసో కౌన్సిల్ ప్రారంభం

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): నేరాలను ఛేదించడంలో తెలంగాణ దేశంలోనే మొదటి వరుసలో ఉన్నదని డీజీపీ అంజనీకుమార్ చెప్పారు. గచ్చిబౌలిలోని సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన 'లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సిసో కౌన్సిల్'ను శనివారం ఐటీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్‌రంజన్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్రతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ సైబర్ నేరాలు పోలీసులకు సవాల్‌గా మారుతున్నాయని అన్నారు. ఈ ఏడాది చివరి నాటికి దాదాపు 8 లక్షల కోట్ల డాలర్లు సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి వెళ్తాయని, ఇది గత ఏడాది అమెరికా జీడీపీలో మూడవ వంతుతో సమానమని చెప్పారు. ఇంతటి క్లిష్టమైన సైబర్ నేరాలను నిపుణుల సహకారంతో తెలంగాణ పోలీసులు ఛేదించగలుగుతున్నారని అన్నారు. బాధితులు పోగొట్టుకున్న డబ్బును తిరిగి రికవరీ చేయడంలో సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర, ఐటీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్‌రంజన్ బ్రైటింగ్ స్టార్స్ అని ప్రశంసించారు.

సైబర్ నేరగాళ్ల బారిన పడితే 1930కి ఫిర్యాదు చేయాలి : జయేశ్‌రంజన్

దేశంలోనే తొలిసారిగా అందుబాటులోకి వచ్చిన లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సిసో కౌన్సిల్ తెలంగాణలో సైబర్ సెక్యూరిటీకి 'దీపస్తంభం' అని జయేశ్‌రంజన్ పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రతిదీ డిజిటలైజేషన్ అవుతున్నదని, డిజిటల్ వినియోగదారులు పెరిగినప్పుడు సైబర్ నేరాలు కూడా పెరిగే అవకాశం ఉంటుందని చెప్పారు. ఎవరైనా సైబర్ నేరగాళ్ల బారిన పడినప్పుడు వెంటనే 1930 లేదా ఎన్‌సీఆర్‌పీ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. గడిచిన ఏడాది కాలంలో సైబర్ నేరాలు 300 శాతం పెరిగాయని సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకొని మన డిజిటల్ స్పేస్, ప్రభుత్వ సంస్థలు, కీలకమైన పరికరాలు, పరిశ్రమలను రక్షించుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ అదనపు పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి, ట్రాఫిక్ జాయింట్ సీపీ నారాయణ్‌నాయక్, క్రైమ్ డీసీపీ కల్మేశ్వర్, అన్ని జోన్‌ల డీసీపీలు, ఇతర పోలీసు అధికారులు, రమేశ్ కాజా తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీలను మోసగించిందే కాంగ్రెస్

- క్రిస్టియన్ల సంక్షేమానికి సీఎం కేసీఆర్ ఎంతో చేస్తున్నారు
- 9 ఏండ్లలోనే రూ.12 వేల కోట్లు కేటాయించారు
- కాంగ్రెస్ హయాంలో కేటాయించింది రూ.900 కోట్లే
- మీరెన్ని కుట్రలు పన్నినా క్రైస్తవులంతా బీఆర్ఎస్ వెంటే
- రేవంత్‌కు తెలంగాణ ఫుడ్స్ చైర్మన్ రాజీవ్‌సాగర్ స్పష్టీకరణ

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): స్వరాష్ట్రంలో బీఆర్ఎస్ సర్కార్ మైనార్టీలకు పెద్దపీట వేసిందని తెలంగాణ ఫుడ్స్ చైర్మన్ మేడే రాజీవ్‌సాగర్ ప్రశంసించారు. గతంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ మైనార్టీల సంక్షేమానికి కేవలం రూ.900 కోట్లను మాత్రమే కేటాయిస్తే.. తెలంగాణ ఏర్పాటు తర్వాత సీఎం కేసీఆర్ కేవలం 9 ఏండ్లలోనే రూ.12 వేల కోట్లు కేటాయించారని శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణలోని మైనార్టీలకు బీఆర్ఎస్ పార్టీ చాలా చేసిందని, అంతకు ముందు పదేళ్ల కాలంలో కాంగ్రెస్ పార్టీ ఏం చేసిందో చెప్పాలని అన్నారు. ఈ అంశంపై చర్చకు సిద్ధమా? అని పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరారు. మైనార్టీలను మోసగించిందే కాంగ్రెస్ పార్టీ అని, బీఆర్ఎస్ సర్కార్‌పై బురదజల్లే ప్రయత్నం చేస్తే కర్రుకాల్చి వాత పెడతామని స్పష్టం చేశారు. తెలంగాణ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా సీఎం కేసీఆర్ 100 శాతం సబ్సిడీతో రూ.లక్ష ఆర్థిక సాయం అందించడంతోపాటు విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసించేవారికి స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్నారని గుర్తుచేశారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో మైనార్టీలకు ఏం చేశారో చెప్పాలని రేవంత్‌ను నిలదీశారు. క్రిస్మస్ సందర్భంగా సీఎం కేసీఆర్ దాదాపు 2.85 లక్షల క్రైస్తవ కుటుంబాలకు కానుకలు అందజేస్తున్నారని, ఆయన మైనార్టీల పక్షపాతి అనడానికి 204 మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలే నిదర్శనమని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర క్రైస్తవ హక్కుల సమావేశం పేరుతో బీఆర్ఎస్ సర్కార్‌పై విషం కక్కుతున్నారని రాజీవ్‌సాగర్ మండిపడ్డారు. కాంగ్రెస్ ఎన్ని కుట్రలు చేసిన క్రిస్టియన్లను బీఆర్ఎస్ పార్టీ నుంచి దూరం చేయలేరని స్పష్టం చేశారు. గతంలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తగా పనిచేసిన రేవంత్ రెడ్డి క్రిస్టియన్ల సంక్షేమం గురించి మాట్లాడటం దయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉన్నదని విమర్శించారు.

అలకపాన్పుపై జానా!

- తమ కుటుంబానికి రెండు టికెట్లు హామీ దక్కకపోవడంతో అసంతృప్తి
- తమకు ఎందుకు ఇవ్వరని ప్రశ్న

హైదరాబాద్, అక్టోబర్ 7(నమస్తే తెలంగాణ): తన కుమారులు ఇద్దరికీ ఎమ్మెల్యే టికెట్లు ఇస్తామన్న హామీ దక్కకపోవడంతో కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డి అలిగినట్టు ప్రచారం జరుగుతున్నది. ఆయన ఇద్దరు కుమారులు నాగార్జునసాగర్, మిర్యాలగూడ నుంచి కాంగ్రెస్ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. నాగార్జునసాగర్ టికెట్ మాత్రమే ఇస్తామని అధిష్ఠానం ఆయ